

సమస్యలు సమసేనా..?

ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో అస్తవ్యస్త పాలన.. అక్కరకు రాని పంట నష్టపరిహారం.. అడ్డదిడ్డంగా ప్రధాన కాల్వలు, డ్రెయిన్లు.. తీవ్రమైన సాగు, తాగునీటి ఎద్దడి.. పట్టించుకునేవారు లేరు. పరిష్కరించే నాథుడు రాడు. దీంతో ఐదేళ్ల తర్వాత కొత్తగా ఏర్పడిన టీడీపీ కూటమి ప్రభుత్వంపైనే అందరూ ఆశలు పెట్టుకున్నారు. ప్రభుత్వం ఏర్పడ్డాక తొలిసారిగా జరిగే జిల్లాపరిషత్ సర్వసభ్య సమావేశంపైనే అందరి దృష్టి పడింది. చైర్‌పర్సన్ ఉప్పాల హారిక అధ్యక్షతన మచిలీపట్నంలోని జడ్పీ కన్వెన్షన్ హాల్లో శనివారం ఉదయం 10 గంటలకు జరిగే ఈ సమావేశంలో జిల్లాలో నెలకొన్న ప్రధాన సమస్యలపై సమగ్రంగా చర్చించి, సానుకూలమైన నిర్ణయాలు తీసుకునే అవకాశముంది. ఐదేళ్ల తరువాత వైసీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు లేకుండా జరిగే సమావేశం కూడా ఇదే కావడం విశేషం.

- ఆంధ్రజ్యోతి, మచిలీపట్నం

నేడు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

- కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక తొలిసారిగా..
- పాల్గొననున్న కొత్త ఎమ్మెల్యేలు, ఎంపీలు
- వైసీపీ ఎమ్మెల్యేలు లేకుండా జరిగే మొదటి సమావేశం
- ప్రధాన సమస్యల పరిష్కారంపైనే అందరి దృష్టి
- మంత్రులు దిశానిర్దేశం చేస్తారని ఆశలు

ముఖ్య సమస్యలపై చర్చకు సభ్యుల పట్టు



మచిలీపట్నంలోని జడ్పీ కార్యాలయం

వైసీపీ ఎమ్మెల్యేలు లేని సమావేశం

గతం : జిల్లా పరిషత్‌లో 48 జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగ్గా, అందులో 46 మంది వైసీపీకి చెందినవారే ఉన్నారు. పెడన, మోపిదేవి జడ్పీటీసీ స్థానాల్లోనే టీడీపీ సభ్యులున్నారు. దీంతో పాటు ఉమ్మడి జిల్లాలోని 16 నియోజకవర్గాల్లో 14 మంది వైసీపీ ఎమ్మెల్యేలు, టీడీపీ నుంచి గెలిచి వైసీపీలోకి వెళ్లిన గన్నవరం ఎమ్మెల్యే ఉండేవారు. మచిలీపట్నం ఎంపీ స్థానం వైసీపీది కాగా, విజయవాడ ఎంపీ స్థానం టీడీపీకి ఉండేది.

ప్రస్తుతం : మేలో జరిగిన ఎన్నికల్లో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. 16 మంది ఎమ్మెల్యేలు సహా రెండు ఎంపీ స్థానాలను టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి గెలుచుకుంది. దీంతో ఈసారి జరిగే జడ్పీ సమావేశంలో వైసీపీ తరఫున పాల్గొనే శాసనసభ్యులు, ఎంపీలు లేకుండాపోయారు. వైసీపీ పాలనలో మూడేళ్ల పాటు మంత్రుల హోదాలో వెలంపల్లి శ్రీనివాసరావు, కొడాలి నాని, పేర్ని నాని జడ్పీ సమావేశాల్లో పాల్గొనేవారు. ఆ తరువాత రెండేళ్ల పాటు మంత్రి హోదాలో జోగి రమేశ్ అప్పుడప్పుడు పాల్గొనేవారు. ప్రస్తుతం టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఉమ్మడి జిల్లాలో మంత్రులుగా ఉన్న కొల్లు రవీంద్ర, కొలుసు పార్థసారథి మంత్రుల హోదాలో జడ్పీ సమావేశంలో పాల్గొననున్నారు. కూటమి తరఫున గెలిచిన 16 మంది శాసనసభ్యులు ఈ సమావేశంలో పాల్గొననున్నారు. ఉమ్మడి జిల్లా నుంచి వైసీపీకి చెందిన ఒక్క ఎమ్మెల్యే కూడా ఎన్నిక కాకపోవడంతో మరో ఐదేళ్ల వరకు జడ్పీ సమావేశంలో ఆ పార్టీ నుంచి పాల్గొనేందుకు అవకాశం లేని పరిస్థితి ఏర్పడింది.

పంట నష్టపరిహారం పక్కదారి

ఉమ్మడి జిల్లాలో గత ఏడాది ఖరీఫ్‌లో 3.20 లక్షల హెక్టార్లలో వివిధ పంటల సాగు జరిగింది. డిసెంబరులో మిచౌంగ్ తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలకు పంట దెబ్బతింది. రైతులకు పంట నష్టపరిహారం అందించడంలో గత ప్రభుత్వం జాప్యం చేసింది. పెడన మండలంలోని నాలుగు గ్రామాల పరిధిలో వ్యవసాయ భూముల్లేని వారి బ్యాంకు ఖాతాల్లో పరిహారం సొమ్మును జమ చేశారు. ఈ తరహాలో రూ.42 లక్షల వరకు పక్కదారి పట్టిందని వ్యవసాయ శాఖ అధికారుల ప్రాథమిక విచారణలో తేలింది. మచిలీపట్నం మండలంలోనూ నాలుగైదు గ్రామాలకు చెందిన రైతుల ఖాతాల్లో ఇంతవరకు పంట నష్టపరిహారం జమ కాలేదు. ఈ అంశంపై సమావేశంలో అధికారులను నిలదీసేందుకు సభ్యులు సిద్ధమవుతున్నారు.

కాల్వల పూడికతీతే ప్రధాన అంశం

సాగునీటి ప్రధాన కాల్వలు, ప్రధాన డ్రెయిన్లలో మేటవేసి నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న తూడు, గుర్రపుడెక్క, నాచులను తొలగించే పనులను ఇంకా సక్రమంగా చేయడం లేదు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా వంతెనల వద్దకు కొట్టుకొచ్చిన గుర్రపుడెక్క, నాచును మాత్రమే తొలగించే పనులు చేస్తూ మమ.. అనిపిస్తున్నారు. పూర్తిస్థాయిలో పూడికతీత పనులు చేయడం లేదు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో కీలకమైన ఈ అంశంపై జడ్పీ సమావేశంలో చర్చించి ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాలి.

సాగునీటి ఎద్దడిపై కీలక చర్చ

ఉమ్మడి జిల్లాలో 3.20 లక్షల హెక్టార్లలో వరిసాగు జరుగుతోందని అంచనా. ఇప్పటివరకు 80 వేల హెక్టార్లలో సాగు జరిగింది. ఈ నెలలో పది రోజులు భారీ వర్షాలు కురవడంతో సాగునీటి ఎద్దడి కొంతమేర తీరింది. భారీవర్షాలు కురవడంతో పట్టిసీమ ప్రాజెక్టు నుంచి నీటి పంపింగ్‌ను నిలిపివేశారు. శుక్రవారం నుంచి మళ్లీ నీటి పంపింగ్ ప్రారంభించారు. ఈ నీరు ప్రకాశం బ్యారేజీకి చేరుకోవాలంటే కనీసం 36 గంటల సమయం పడుతుందని నీటిపారుదల శాఖ అధికారులు చెబుతున్నారు. పులిచింతల ప్రాజెక్టులో ప్రస్తుతం ఒక్క టీఎంసీ నీరు మాత్రమే ఉండటంతో పట్టిసీమ నుంచి వచ్చే నీరు, వర్షాలు కురిస్తే అందుబాటులోకి వచ్చే నీరే వ్యవసాయానికి ప్రధాన ఆధారంగా కనిపిస్తోంది. ఆగస్టులో వర్షాలు కురిస్తే సాగునీటి అవసరాలకు పెద్దగా ఇబ్బందులు ఉండవు. కానీ, ఆశించిన మేర వర్షాలు కురవకపోతే సాగునీటి ఎద్దడి తలెత్తుతుంది. కృష్ణాడెల్టాకు సాగునీటి విడుదల, పంటలను రక్షించడంపై ఈ సమావేశంలో సమగ్రమైన చర్చ జరగాల్సి ఉంది.

జగనన్న కాలనీల్లో వసతుల కల్పన ఏదీ..?

ఉమ్మడి జిల్లాలో 1,400కు పైగా జగనన్న లే అవుట్లు ఉన్నాయి. వాటిలో కనీస వసతులు లేవు. ఈ లే అవుట్లలో రహదారుల నిర్మాణం, తాగునీటి పైపులైన్లు, విద్యుత్ లైన్ల ఏర్పాటు వంటి పనులు చేపట్టాల్సి ఉంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కాలనీల్లోని రహదారులు చిత్తడిగా మారాయి. అక్కడ నివసించే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ కాలనీల్లో కనీస వసతులు కల్పించేందుకు అవసరమైన నిధులను విడుదల చేసేందుకు కొంతకాలం వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ సమావేశంలో విద్య, గృహ నిర్మాణం, వైద్యం, పంచాయతీరాజ్, పౌరసరఫరాలు తదితర విభాగాల్లో నెలకొన్న సమస్యలను ఎత్తిచూపేందుకు సభ్యులు సిద్ధంగా ఉన్నారు.



అంగన్వాడీలో కలెక్టర్

మచిలీపట్నంలోని పఠాన్‌పేట, రామరాజుపాలెం గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాలను కలెక్టర్ బాలాజీ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్వాడీ విద్యార్థులకు నేర్పుతున్న విద్యావిధానంపై ఆరా తీసిన ఆయన పిల్లలతో సందడిగా గడిపారు. పిల్లల బరువు, ఎత్తు పరిశీలించిన ఆయన వారితో కలిసి భోజనం కూడా చేశారు.

6లో..

విజిలెన్స్ విచారణ పక్కదారి..!

- విజిలెన్స్ విచారణకు ఆదేశించిన ప్రభుత్వం
- ముడుపుల మాయతో ఆర్‌డబ్ల్యూఎస్ విచారణగా మార్పు
- విచారణ సవ్యంగానే సాగేనా.. అనే అనుమానాలు

ఆర్‌డబ్ల్యూఎస్‌లో కంప్యూటర్ల కొనుగోల్‌మాల్ వ్యవహారంలో..

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : గ్రామీణ నీటి సరఫరా విభాగంలో కంప్యూటర్ల కొనుగోల్‌మాల్ వ్యవహారాలపై అధికారులు తప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ గోల్‌మాల్ వ్యవహారంపై ఇప్పటికే ప్రభుత్వం సీరియస్ అయ్యింది. అంతేకాదు.. నగరంలోని రిటైల్ డీలర్ ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ సంస్థను వివరణ కోరింది. కంప్యూటర్లను కొనటానికి ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ కార్యాలయం అనుమతులు కోరిందా? మీ పర్యవేక్షణలోనే కొనుగోళ్లు జరిగాయా? ఎంత ధర నిర్ణయించారన్న వివరాలను అడిగింది. అయితే, కంప్యూటర్ల కొనుగోలుపై ఆర్‌డబ్ల్యూఎస్ తమను సంప్రదించలేదని ఏపీటీఎస్‌ఎల్ చెప్పడంతో ప్రభుత్వం సీరియస్ అయింది. ఈ వ్యవహారంపై రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్.. ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ కార్యాలయాన్ని వివరణ కోరారు. సమాధానాలు సంతృప్తికరంగా రాకపోవడంతో ఆయన విజిలెన్స్ విచారణకు ఆదేశించారు.

విచారణను మార్చేశారు..!

దొరికిపోతామన్న ఉద్దేశంతో ఉన్న ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ కార్యాలయ అధికారులు విజిలెన్స్ విచారణను నీరుగార్చారు. విజిలెన్స్ విచారణను మార్చేసి.. ఆర్‌డబ్ల్యూఎస్ విజిలెన్స్ బృందం ద్వారా విచారణ జరిపేలా ఆదేశాల్లో మార్పు చేశారు. ప్రిన్సిపల్ సెక్రటరీ ఇచ్చిన ఆదేశాలను కూడా కాదని, ఆర్‌డబ్ల్యూఎస్ అంతర్గత విజిలెన్స్‌కు విచారణ అప్పగించటంపై అనేక ఆరోపణలు వస్తున్నాయి. ఆర్‌డబ్ల్యూఎస్ అంతర్గత విజిలెన్స్‌లో ఒక డీఈ స్థాయి అధికారి ఉంటారు. ఒక సీఈ జరిపిన వ్యవహారంపై కిందిస్థాయి డీఈ విచారణ చేయగలరా? ఒకవేళ చేసినా పారదర్శకంగా జరుగుతుందా? అనేది సందేహమే. కిందిస్థాయి అధికారులను ఉన్నతాధికారులు లొంగదీసుకునే అవకాశం ఉండదా అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఇలాంటపుడు విచారణ పారదర్శకంగా జరుగుతుందా.. అనే అనుమానాలు కలుగుతున్నాయి. విజిలెన్స్ విచారణ మార్చిన వ్యవహారంలో లక్షలాది రూపాయలు చేతులు మారినట్టుగా తెలుస్తోంది. ఈ వ్యవహారం ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకొచ్చేది కావడంతో సమగ్ర విచారణకు ఆదేశాలు ఇవ్వాల్సిన అవసరం ఉంది.





పెడన నియోజకవర్గంలో ఇంకా జోగి రమేశ్ హవా కొనసాగుతోందా? నియోజకవర్గంలో ఆయన చేసిన భూదందాలు, అసైన్డ్, ప్రభుత్వ భూముల స్వాధీనంలో జరిగిన అక్రమాలు బయటపడకుండా తెరవెనుక చక్రం తిప్పుతున్నారా? పెడన నుంచి పెనమలూరు వెళ్లినా, ఆయనకు గుట్టుచప్పుడు కాకుండా సహకరిస్తున్న కీలక వ్యక్తులు, అధికారులు ఎవరు? అనే అంశంపై ఇపుడు చర్చ జరుగుతోంది. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో ఐదేళ్లుగా జోగి రమేశ్ చేసిన అక్రమాలు వెలుగులోకి రాకుండా చూసుకునేందుకు, తనకు అనుకూలంగా ఉండే తహసీల్దార్లను కృత్తివెన్ను, బంటుమిల్లి మండలాల్లో పోస్టింగ్ ఇప్పించుకునేందుకు ఆయన పావులు కదుపుతున్నారన్న ప్రచారం జోరుగా సాగుతోంది.

వామ్మో... జోగి

ఓడిపోయినా ఆగని మాజీమంత్రి జోగి రమేశ్ అక్రమాలు

అధికారం మారినా..

ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ భూముల వ్యవహారం తెరపైకి వచ్చింది. వీటిని జోగి రమేశ్ కబంధ హస్తాల నుంచి ఖాళీ చేయించేందుకు కూటమి నాయకులు అధికారులకు ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. కోట్ల రూపాయలు ఖర్చుచేసి భూములను లీజుకు తీసుకున్న భీమవరం బడాబాబులు ఆ భూములను ఖాళీ చేయాల్సి వస్తే తమ పరిస్థితి ఏమిటోనని ఆందోళన చెందుతున్నారు. మాజీమంత్రిపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. దీంతో రంగంలోకి దిగిన జోగి ఈ భూములకు సంబంధించిన సమాచారం బయటకు రాకుండా ఉండేందుకు వారంలో జరిగే తహసీల్దార్ల బదిలీల్లో తనకు అనుకూలమైన అధికారులను కృత్తివెన్ను, బంటుమిల్లి మండలాల్లో పోస్టింగ్ ఇప్పిస్తానని, కంగారు పడవద్దని అభయమిచ్చినట్లు సమాచారం. తనకు అనుకూలంగా ఉండే అధికారులను ఎంపిక చేసుకుని వారిని ఆ మండలాల్లో నియమింపజేసేందుకు ప్రయత్నిస్తున్నారని రెవెన్యూ ఉద్యోగుల్లో చర్చ నడుస్తోంది. ఈ రెండు మండలాల తహసీల్దార్ల నియామకంలో కూటమి ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే అంశంపై ఉత్కంఠ నెలకొంది.

- పెడనలో భూదందాలు కప్పిపుచ్చేందుకు తంటాలు
- కృత్తివెన్ను, బంటుమిల్లి మండలాల్లో తహసీల్దార్ల నియామకానికి వ్యూహాలు
- తహసీల్దార్లు తనవారైతే ప్రశ్నించరనే పన్నాగాలు
- భీమవరం బడాబాబులను రక్షించేందుకు పాట్లు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : కృత్తివెన్ను మండలం గరిసపూడి రెవెన్యూ గ్రామ పరిధిలో అసైన్డ్, ప్రభుత్వ భూములున్నాయి. సముద్రపు ఆటుపోట్లు సంభవించే సమయంలో ఉప్పునీరు ఈ భూముల్లోకి వచ్చిపోతూ ఉంటుంది. దీంతో రైతులు ఈ భూములను సాగు చేయకుండా అలాగే ఉంచేశారు. ఈ గ్రామ పరిధిలోని భూములపై కన్నేసిన అప్పటి మంత్రి జోగి రమేశ్ లీజు పేరుతో 300 ఎకరాలను రైతుల నుంచి తన ఆధీనంలోకి తెచ్చుకున్నారు. కొంతమంది రైతులకు ఏడాదికి ఎకరాకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు లీజు చెల్లిస్తానని, ఏడేళ్ల పాటు లీజు అగ్రిమెంట్ చేసుకున్నాడు. మంత్రి పదవిని అడ్డుపెట్టుకుని 300 ఎకరాల అసైన్డ్ భూములు, మరికొంత ప్రభుత్వ భూమిని భీమవరానికి చెందిన బడాబాబులకు ఏడాదికి ఎకరాకు రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు సబ్‌లీజుకు ఇచ్చి, వారితోనే చెరువులుగా తవ్వించాడు. ఈ వ్యవహారంలో అప్పట్లో రూ.కోట్లు చేతులు మారాయి. ఎలాంటి అనుమతులు లేకుండానే ఈ భూములను చెరువులుగా తవ్వుతున్నా ఎవరూ ఆ వైపునకు వెళ్లకుండా అధికారులను కట్టడి చేశాడు. కృత్తివెన్ను, బంటుమిల్లి మండలాల్లో ఇదే తరహాలో అసైన్డ్, ప్రభుత్వ భూములను చేపలు, రొయ్యల చెరువులుగా మార్పించాడు. ఈ భూ ఆక్రమణలకు ఎవరూ అడ్డు చెప్పకుండా అసైన్డ్ భూములకు పేదల పేరిట పట్టాలు ఇప్పిస్తానని నమ్మించాడు. తన చుట్టూ తిరిగే కార్యకర్తలు, మాజీ సైనికుల పేర్లతో అసైన్డ్ భూములకు పట్టాలు ఇవ్వాలని రెండువేల పేర్లతో జాబితాలు తయారు చేయించాడు. ఈ జాబితాల ఆధారంగా పేదలకు అసైన్డ్ భూములకు పట్టాలు ఇవ్వాలని అప్పట్లో రెవెన్యూ అధికారులు, ఇద్దరు కలెక్టర్లపైనా ఒత్తిడి తెచ్చాడు. ఈ అంశం ప్రభుత్వ పెద్దల దృష్టికి వెళ్లడంతో వివాదాస్పదమైంది.



దుర్గగుడిలో వారిద్దరి స్టైలే వేరు. ఎన్ని బదిలీలైనా, ఎన్ని రోజులైనా కాసులు కురిపించే కీలక స్థానాలను మాత్రం వారు వదలరంటే వదలరు. తీవ్రమైన ఆరోపణలు ఉన్నా, విజిలెన్స్ అభ్యంతరాలు వ్యక్తం చేసినా వారిద్దరినీ పక్కన పెట్టేవారే ఉండరు. ఉన్నతాధికారులను ప్రసన్నం చేసుకుని పోస్టులను ఏరికోరుకుని మరీ ఎంచుకుని కూర్చుంటారు. వీరిలో ఒకరి ఉద్యోగ నియామకంలోనే వివాదాలున్నా.. మరొకరిని ఏసీబీ కేసులు వెంటాడుతున్నా.. తాజాగా జరిగిన దుర్గగుడి అంతర్గత బదిలీల్లో ప్రాధాన్యమైన పోస్టులు కల్పించడం వెనుక విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. - విజయవాడ ఆంధ్రజ్యోతి

ఆరోపణలున్నా అందలమే..

దుర్గగుడి అంతర్గత బదిలీల అర్థాలే వేరు

ఇద్దరు సూపరింటెండెంట్ల బదిలీపై సందేహాలు

అవినీతి ఆరోపణలున్నా కీలక స్థానాలు కేటాయింపు

- కాసులు ముట్టే స్థానాల్లో నియామకం
- ఉద్యోగ వర్గాల్లో జోరుగా సాగుతున్న చర్చ

ఆయనంతే.. మారరంతే..

కొద్దిరోజుల క్రితం జరిగిన బదిలీల్లో ఒక సూపరింటెండెంట్‌కు కీలక బాధ్యతలు అప్పగించారు. దత్తత దేవాలయాల బాధ్యతలు చూసే ఆయనకు టోల్‌గేట్, దుర్గాఘాట్ హారతులు, కేశఖండన శాల బాధ్యతలు ఇచ్చారు. ఎలాంటి మచ్చలు లేని సూపరింటెండెంట్‌కు ఈ బాధ్యతలు అప్పగించి ఉంటే దేవస్థాన ఉద్యోగ వర్గాల్లో చర్చ జరిగేది కాదు. కొన్నాళ్ల క్రితం ఈ సూపరింటెండెంట్ ద్వారకా తిరుమల దేవస్థానం నుంచి ఇక్కడికి వచ్చారు. అక్కడ టోల్‌గేట్ నిధుల వ్యవహారంలో గోల్‌మాల్ జరిగినట్టు ఈయనపై అభియోగాలు ఉన్నాయి. తర్వాత అక్కడి నుంచి సాధారణ బదిలీల్లో దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానానికి వచ్చారు. కొన్ని నెలల పాటు ప్రసాదాలు, టికెట్ కౌంటర్ల బాధ్యతలను పర్యవేక్షించారు. భ్రమరాంబ ఈవోగా ఉన్నప్పుడు ప్రసాదాల కౌంటర్లలో పులిహోర ప్యాకెట్ల లెక్కల్లో తేడాలు వచ్చినట్టు గుర్తించారు. ఆ సమయంలో ఈ సూపరింటెండెంట్‌పై ఆరోపణలు వచ్చాయి. అప్పటి పాలక మండలి చైర్మన్ నేరుగా ఆయన విషయంలో ఈవోతో యుద్ధానికి దిగారు. అయినా భ్రమరాంబ ఆయనను వెనుకేసుకొచ్చారు. ఆ తర్వాత కొన్నాళ్లకు సదరు అధికారి అవినీతి నిరోధక శాఖ అధికారులకు చిక్కారు. ఆయన ఇంట్లో లెక్కలు లేని రూ.35 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఉద్యోగం నుంచి సస్పెండ్ చేశారు. భ్రమరాంబ ఇక్కడి నుంచి బదిలీ అయ్యాక ఆయన మళ్లీ విధుల్లో చేరారు. కొద్దిరోజుల క్రితం వరకు ఆయనకు దత్తత దేవాలయాలను అప్పగించారు. తాజాగా జరిగిన అంతర్గత బదిలీల్లో ఆయనపై అధికారులకు నమ్మకం పుట్టుకొచ్చింది. ఆదాయానికి కేంద్ర బిందువుగా ఉండే టోల్‌గేట్, కేశఖండన శాల బాధ్యతలను అప్పగించారు. ఆయనకు ఇంకా ఎటువంటి క్లీన్‌చిట్ రాకుండానే అధికారులు కీలక బాధ్యతలు అప్పగించడం విమర్శలకు తావిస్తోంది.

విధులు అక్కడ.. వేతనమిక్కడ

దేవదాయ ఉద్యోగుల అన్ని వ్యవహారాలు ఆ శాఖ కమిషనర్ కార్యాలయంతో ముడిపడి ఉంటాయి. ఇక్కడ పనిచేయడానికి దుర్గామల్లేశ్వరస్వామి ఆలయ ఉద్యోగులు తహతహలాడుతుంటారు. సిఫార్సుల్లో పోటీపడి మరీ పోస్టింగ్‌లు సంపాదించుకుంటారు. దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో సూపరింటెండెంట్‌గా వ్యవహరించే ఓ ఉద్యోగి ప్రస్తుతం కమిషనర్ కార్యాలయంలో కీలక పోస్టులో ఉన్నారు. ఆయన విధులు కమిషనరేట్‌లో నిర్వర్తిస్తున్నా వేతనం మాత్రం దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం నుంచే అందుకుంటారు. ఈయన కమిషనరేట్‌లో చక్కబెడుతున్న వ్యవహారాలు వివాదాస్పదమవుతున్నాయి. కాసులు కురిపించే వ్యవహారాలను జోరుగా చక్కబెడుతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఈ సూపరింటెండెంట్ ఉద్యోగ నియామకంలోనూ వివాదాలు ఉన్నాయి. రాష్ట్ర విభజనకు ముందు ఈయన తెలంగాణలోని యాదాద్రి దేవస్థానంలో పనిచేశారు. విభజన తర్వాత అనూహ్యంగా దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానానికి బదిలీ అయ్యారు. ఇది దేవదాయ శాఖ నిబంధనలకు విరుద్ధమని ఉద్యోగ వర్గాలు చెబుతున్నాయి.



శిథిలావస్థలో ఉన్న అవుట్‌ఫాల్ స్లూయిస్ గేట్లు

సాగు జరిగేనా..?

- కోడూరు మండలంలో వర్షాలు తెచ్చిన తంటా
- పంట పొలాల్లో భారీగా నిలిచిన వర్షపు నీరు
- శిథిలావస్థలో అవుట్‌ఫాల్ స్లూయిస్ గేట్లు

భారీ వర్షాలు కోడూరు మండలం, ఆ దిగువ ప్రాంతాల్లోని రైతులను భారీగా దెబ్బతీశాయి. హంసలదీవి, పాలకాయితిప్ప, దింటిమెరక, ద్వారకా గ్రామాల సమీపంలో పొలాల్లో వర్షపు నీరు బయటకుపోకుండా నిలిచిపోయింది. పాలకాయితిప్ప అవుట్‌ఫాల్ స్లూయిస్, కోడూరు అవుట్‌ఫాల్ స్లూయిస్ గేట్లు పూర్తిగా పాడవటమే దీనికి ప్రధాన కారణం కాగా, ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతికందుతుందో లేదోనని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.

6లో..

దుర్గగుడి గోపుర స్వర్ణతాపడానికి విరాళం



వన్‌టౌన్, జూలై 26 : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ ఆలయ గోపుర స్వర్ణతాపడానికి పశ్చిమగోదావరి జిల్లా విస్సాకోడూరుకు చెందిన మీసాల రేణుకా స్వాతి శుక్రవారం ఆలయానికి విచ్చేసి డోనర్ సెల్ అధికారి డీవీవీ సత్యనారాయణ ద్వారా వెయ్యి సింగపూర్ డాలర్లను విరాళంగా సమర్పించారు.

31 గ్రాముల బంగారు కాయిన్ కానుక..



హైదరాబాద్ యూసఫ్‌గూడకు చెందిన కొమ్మురాజు శివరామకృష్ణ కుటుంబసభ్యులతో కలిసి శుక్రవారం ఆలయ అధికారుల ద్వారా 31గ్రాముల బంగారు కాయిన్‌ను అమ్మవారికి కానుకగా అందజేశారు. దాతలకు అమ్మవారి దర్శనం అనంతరం వారికి ఆశీస్సులు, ప్రసాదం శేషవస్త్రం, అమ్మవారి చిత్రపటం అందజేశారు.



హెల్మెట్ ధారణపై అవగాహన ర్యాలీలో న్యాయాధికారి రామకృష్ణయ్య

చట్టాలపై అవగాహన అవసరం

» న్యాయాధికారి కేవీ రామకృష్ణయ్య

పెడన, జూలై 26 : చట్టాలపై ప్రతిఒక్కరికి అవగాహన అవసరమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయాధికారి కేవీ రామకృష్ణయ్య అన్నారు. పట్టణంలోని శ్రీ విజయానంద డిగ్రీ కళాశాలలో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సదస్సులో రామకృష్ణయ్య మాట్లాడుతూ, చట్టాలపై అవగాహన లేక పేదలు న్యాయం పొందలేకపోతున్నారన్నారు. చట్టాలు, ఉచిత న్యాయసేవలపై అవగాహన కల్పించేందుకు సదస్సులు నిర్వహిస్తూ.. ఉచితంగా న్యాయ సలహాలు ఇచ్చేందుకు తమ సంస్థ ఆధ్వర్యంలో మండల కేంద్రాల్లో లీగల్ ఎయిడ్ క్లినిక్‌లు నిర్వహిస్తున్నామన్నారు.

హెల్మెట్ ధారణ బాధ్యతగా భావించాలి..

హెల్మెట్ ధారణను వాహనదారులు బాధ్యతగా భావించాలని న్యాయాధికారి కేవీ రామకృష్ణయ్య అన్నారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు హెల్మెట్ ధరించకపోవడం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయాధికారి కేవీ రామకృష్ణయ్య తెలిపారు. శుక్రవారం పట్టణంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ప్రమాదాలు సంభవిస్తే హెల్మెట్‌లు రక్షణ కవచంగా ప్రాణాలు కాపాడతాయన్నారు. ర్యాలీలో విజయానంద విద్యా సంస్థల విద్యార్థులు పాల్గొన్నారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపైనా అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని రామకృష్ణయ్య తెలిపారు. తహసీల్దార్ కె.రాంబాబు, కమిషనర్ బి.వెంకట్రామయ్య, టీపీవో ఏసుబాబు, విజయానంద డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నాగమల్లేశ్వరరావు, న్యాయవాదులు అజ్మతు న్నీసా, రషీద్, ఆర్ఐ మణికుమార్, బంటుమిల్లి, కృత్తివెన్ను ఎస్ఐలు నాగరాజు, వాసు, సచివాలయ, మునిసిపల్, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న టీడీ జనార్దన్

ఢిల్లీలో జగన్ లొల్లి హాస్యాస్పదం : టీడీ జనార్దన్

వత్సవాయి, జూలై 26 : రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి అనడం హాస్యాస్పదంగా ఉందని మాజీ ఎమ్మెల్సీ టీడీ జనార్దన్ అన్నారు. మండలంలోని ప్రజలకు కావాల్సిన అవసరాలపై ఆయన ఆరా తీశారు. ముఖ్యంగా ఇంటి స్థలం, పింఛన్లపై చర్చించారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలు స్వేచ్ఛగా, సంతోషంగా ఉన్నారన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం గత సీఎం ఎలాంటి చర్యలు తీసుకోకుండా తనపై కేసుల ఎత్తివేత కోసం ఢిల్లీ చుట్టూ ప్రదక్షిణలు చేశారన్నారు. చంద్రబాబు ఢిల్లీ పర్యటన చేసి అమరావతి అభివృద్ధికి రూ.15 వేలకోట్ల నిధులు సాధించారన్నారు. హైదరాబాద్‌కు దీటుగా అమరావతి నిర్మాణానికి చంద్రబాబు ప్రణాళికలు చేస్తున్నారన్నారు. జగన్ ఢిల్లీ వెళ్లి ఏపీలో శాంతి భద్రతలు క్షీణించాయని, 36 మందిని హత్య చేశారని ఆరోపించడం విడ్డూరంగా ఉందన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు జొన్నలగడ్డ రాధాకృష్ణమూర్తి, రైతు నాయకుడు తొండెపు జగన్మోహన్ రావుత తదితరులు పాల్గొన్నారు.



ప్లాంట్ ఆవరణలో కంప తొలగిస్తున్న సంస్థ సిబ్బంది

అశోక్ లేలాండ్ పనుల పునరుద్ధరణ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : మల్లవల్లి మోడల్ ఇండస్ట్రియల్ పార్క్‌లో అశోక్ లేలాండ్ సంస్థ బస్ బాడీ బిల్డింగ్ ప్లాంట్ పనుల పునరుద్ధరణ పనులు చేపట్టింది. గత ఐదేళ్లుగా ప్లాంట్ పనిచేయకపోవటంతో.. ఆవరణ అంతా పిచ్చిచెట్లు, కంప, పొదలతో కమ్ముకుపోయింది. శుక్రవారం ప్లాంట్ ఆవరణలో పెద్ద ఎత్తున పెరిగిన చెట్ల తొలగింపు పనులను అశోక్ లేలాండ్ సంస్థ సిబ్బంది చేపట్టారు. ప్లాంట్‌ను పునరుద్ధరించేందుకు సంస్థ అడుగులు వేస్తోంది. ఈ క్రమంలో ప్లాంట్‌ను తీర్చిదిద్దటం కోసం జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారు. ఎక్స్‌కవేటర్లను తీసుకు వచ్చి ప్రత్యేకంగా పూజలు నిర్వహించి జంగిల్ క్లియరెన్స్ పనులు ప్రారంభించారు. అతి త్వరలో ప్లాంట్‌ను సంస్థ పునరుద్ధరించనుంది. దీంతో మల్లవల్లికి మళ్లీ పూర్వ వైభవం రాబోతోంది.

సారె సమర్పిస్తాం.. శేషవస్త్రాలివ్వండి

» దుర్గగుడి అధికారులకు వన్‌టౌన్ పోలీసుల లేఖ

వన్‌టౌన్, జూలై 26 : ఆషాఢమాసం సందర్భంగా దుర్గమ్మకు సారె సమర్పణల కార్యక్రమాలు జరుగుతున్న నేపథ్యంలో పోలీసు కుటుంబాలు కూడా తమ శక్తి మేరకు సారె సమర్పించడం అనవాయితీగా వస్తోంది. ఈసారి తాము మూకుమ్మడిగా వస్తున్నామని, 200 శేషవస్త్రాలు కావాలని పోలీసులు కోరడం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను పోలీసులు తమ పుట్టింటి ఆడపడుచుగా కొలుస్తుండటం, ప్రత్యేకించి దసరా మహోత్సవాలలో అమ్మవారిని కొలవడం.. పారువేట ఉత్సవానికి అమ్మవారిని తీసుకుని వెళ్లడం వంటివి జరుగుతుంటాయి, ఎవరి లాంఛనాలు వారు అందచేస్తుంటారు. దసరా ఉత్సవాలలో ప్రత్యేక బందోబస్తు చేసిన ఉద్యోగులకు భోజనాలు, అల్పాహారాలు దేవస్థానమే చూస్తుంది. దసరా ముందురోజున పోలీసుల తరఫున పట్టు వస్త్రాల సమర్పణ జరుగుతుంది. ఆ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులకు దేవస్థానం శేషవస్త్రం, ప్రసాదం వంటివి అందజేయడం అనవాయితీ. ఇంతవరకు పోలీసులు ఆషాఢమాసం సందర్భంగా హడావుడి చేసిన పరిస్థితి లేదు. అయితే ఈ ఏడాది విచిత్రంగా వన్‌టౌన్ సీఐ దుర్గాశేఖరరెడ్డి శుక్రవారం దుర్గగుడి ఈవోకు ఓ లేఖ రాశారు. 'వెస్ట్ డివిజన్ నుంచి ఈనెల 28 వతేదీన అమ్మవారికి ఆషాఢ సారె తీసుకువస్తున్నామని, ఈ కార్యక్రమంలో విజయవాడలోని పోలీసు సిబ్బంది ఉన్నతాధికారులు పాల్గొంటారని, వారందరికీ కూడా 200 శేషవస్త్రాలు ఇవ్వాలని' కోరారు. అయితే మున్నెన్నడూ లేనివిధంగా ఇలా లేఖ రాయడం చర్చకు దారితీసింది. శేషవస్త్రం ప్రొటోకాల్ అధికారులకు ఇస్తారని.. మూకుమ్మడిగా శేషవస్త్రాలు అడగడమేమిటన్నది ప్రశ్నగా మారింది. లేని కొత్త సంప్రదాయానికి వన్‌టౌన్ పోలీసులు తెరలేపారని చెబుతున్నారు. మగవారికి శేషవస్త్రాలు ఇస్తే మరి వారి వెంట వచ్చే కుటుంబసభ్యులకు రవికె గుడ్డలు కూడా ఇవ్వాల్సి ఉంటుంది. దీనిపై దేవస్థానం ఏవిధంగా స్పందిస్తుందో వేచి చూడాలి.

స్వాతంత్ర్య వేడుకలకు వేళాయె..

» ఏర్పాట్లపై కలెక్టర్ సృజన సమీక్ష

» ఐజీఎం స్టేడియంలో అధికారుల పర్యటన



స్టేడియంలో ఏర్పాట్లపై సూచనలిస్తున్న కలెక్టర్ సృజన

కృష్ణలంక, జూలై 26 : 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో అధికారులు సమన్వయంతో ఏర్పాట్లను చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన తెలిపారు. ఆగస్టు 15వ తేదీన స్థానిక ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించనున్న 78వ స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమానికి చేయవలసిన ఏర్పాట్లను శుక్రవారం కలెక్టర్ సృజన, ఏపీఎస్పీ డీఐజీ బి.రాజకుమారి, నగర పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్‌బాబు, మున్సిపల్ కమిషనర్ హెచ్.ఎం.ధ్యానచంద్రలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆగస్టు 15వ తేదీన రాష్ట్రస్థాయి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహించనున్నామన్నారు. ముఖ్యమంత్రి, గవర్నర్‌తో పాటు రాష్ట్ర మంత్రులు ఉన్నతాధికారులు వేడుకలలో పాల్గొంటారని తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఏర్పాట్లను సకాలంలో పూర్తిచేసేలా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్, నగరపాలక సంస్థ, రెవెన్యూ, ఆర్అండ్‌బీ, ట్రాన్స్‌కో, ఫైర్ సంబంధిత శాఖల అధికారులు వేడుకల ఏర్పాట్లను ప్రారంభించాలన్నారు. ప్రత్యేకంగా వాట్సాప్ గ్రూప్‌లో ఏర్పాట్లను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరిశీలనలో ఆర్డీవో బీహెచ్ భవానీ శంకర్, డీసీపీలు గౌతమ్ శాలి, ఏబీటీఎస్ ఉదయరాణి, కె.చక్రవర్తి, వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గడువులోగా దరఖాస్తులు పరిష్కరించాలి

» పరిశ్రమలకు 'సింగిల్ డెస్క్' అనుమతులు

» ఎంఎస్ఎంఈలకు రూ.1.14 కోట్ల రాయితీ ప్రయోజనాలు

» డీఐఈపీసీ సమావేశంలో కలెక్టర్ సృజన



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సృజన

కృష్ణలంక, జూలై 26 : సింగిల్ డెస్క్ విధానం కింద జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహికుల నుంచి అందిన దరఖాస్తులను పరిశీలించి, త్వరితగతిన అనుమతుల జారీకి కృషి చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన సూచించారు. శుక్రవారం నగరంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ సృజన అధ్యక్షతన జిల్లా పారిశ్రామిక, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశం జరిగింది. జాయింట్ కలెక్టర్ నిధి మీనా, జిల్లా పరిశ్రమల అధికారి, మెంబర్ కన్వీనర్ ఎ.సుధాకర్, వివిధ శాఖల అధికారులు, పారిశ్రామిక అసోసియేషన్ల ప్రతినిధులు హాజరైన సమావేశంలో 2023, డిసెంబరు 31 నుంచి 2024 జూలై 25 మధ్యకాలంలో సింగిల్ డెస్క్ విధానం కింద అందిన దరఖాస్తుల పరిష్కారం, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల ప్రోత్సాహానికి వివిధ రాయితీల మంజూరు తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించి ఆదేశాలిచ్చారు. వివిధ పరిశ్రమల స్థాపనకు అనుమతులు కోరుతూ మొత్తం 225 దరఖాస్తులు అందగా, సింగిల్ డెస్క్ విధానంలో ఆయా శాఖల ద్వారా 205 దరఖాస్తులు ఆమోదం పొందాయని, 17 దరఖాస్తులు పరిశీలనలో వున్నాయని, మిగిలిన వాటిని తిరస్కరించినట్టు తెలిపారు. పరిశీలనలో వున్న దరఖాస్తులను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని ఏపీఐఐసీ, ఏపీపీసీబీ, ఫ్యాక్టరీలు, అగ్నిమాపక సేవల శాఖల అధికారులను ఆదేశించారు. ఐడీసీ (2015-20), ఐడీసీ (2020-23), బడుగు వికాసం కింద సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల ప్రోత్సాహం కోసం పెట్టుబడి రాయితీ, పావలావడ్డీ, విద్యుత్ టారిఫ్ తదితర రాయితీల కింద మొత్తం 30 యూనిట్లకు దాదాపు రూ.1.14 కోట్ల విలువైన రాయితీ ప్రయోజనాల జారీకి కమిటీ ఆమోదం తెలిపింది. ఉపాధికల్పన, ఆర్థిక వృద్ధి పరంగా కీలకమైన ఎంఎస్ఎంఈల ఏర్పాటుకు, ఉన్న సంస్థల సుస్థిర అభివృద్ధికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని, డీఐఈపీసీ సమావేశాలను ప్రతి నెలా నాలుగో శుక్రవారం క్రమం తప్పకుండా నిర్వహించనున్నట్టు కలెక్టర్ సృజన తెలిపారు. సమావేశంలో ఫ్యాప్సియా ప్రెసిడెంట్ వి.మురళీకృష్ణ, మహిళా పారిశ్రామికవేత్తల అసోసియేషన్ ప్రతినిధి కనకదుర్గ, ఏపీఐఐసీ జెడ్ఎం కె.సీతారాం, ఎల్‌డీఎం కె.ప్రియాంక, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, డీటీసీ ఎం.పురేంద్ర, జిల్లా అగ్నిమాపక అధికారి ఏవీ శంకరరావు, వివిధ పరిశ్రమల ప్రతినిధులు తదితరులు హాజరయ్యారు.

శాంతి భద్రతలపై మాట్లాడే అర్హత జగన్‌కు లేదు

» పోతుల బాలకోటయ్య



ధర్నాచౌక్, జూలై 26 : రాష్ట్రంలో శాంతి భద్రతల గురించి మాట్లాడే అర్హత, హక్కు వైసీపీ అధ్యక్షుడు జగన్‌కు లేదని అమరావతి బహుజన జేఏసీ అధ్యక్షుడు పోతుల బాలకోటయ్య మండిపడ్డారు. తన హయాంలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలపై జరిగిన దాడులు, హత్యలు, ఆత్మహత్యలు, అత్యాచారాలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో శాంతి భద్రలను విచ్ఛిన్నం చేసిన జగన్ ఢిల్లీ వెళ్లి గ్యాలరీ ఫోటో షో నిర్వహించడాన్ని తప్పుబట్టారు. 'మాస్క్ అడిగినందుకు డాక్టర్ సుధాకర్, మాస్క్ పెట్టుకోనందుకు చీరాల కిరణ్‌కుమార్‌లను హత్య చేసిన విషయం గుర్తు లేదా జగన్..' అని ప్రశ్నించారు. 'డ్రైవర్ సుబ్రమణ్యంను హత్య చేసి డోర్ డెలివరీ చేసిన ఎమ్మెల్సీ అనంతబాబును గజమాలలతో సత్కరించి బహిరంగ వేదికలపై రాచమర్యాదలు చేసిన విషయం మర్చిపోయారా..' అన్నారు. 'శిరోముండనం కేసులో శిక్ష పడిన తోట త్రిమూర్తులుకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వలేదా' అన్నారు.. దెయ్యాలు వేదాలు వల్లించినట్టు 60 రోజుల కూటమి ప్రభుత్వంపై చిందులు వేస్తే ప్రజలు నవ్వుకుంటారన్నారు. చేతనైతే రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని, లేదంటే రాజకీయాల నుంచి తప్పుకోవాలని జగన్‌కు బాలకోటయ్య సలహా ఇచ్చారు. అమరావతి రైతు మహిళా నాయకురాలు కొమ్మినేని వరలక్ష్మి మాట్లాడుతూ, జగన్ వందలాది మంది అమరావతి మహిళా రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారన్నారు. అనేక అక్రమ కేసులు బనాయించారన్నారు. అమరావతి ఉద్యమంలో 270 మంది చనిపోయారని, వారి మృతికి జగన్ బాధ్యత వహించాలన్నారు. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలనడం హాస్యాస్పదమన్నారు. రాష్ట్రాభివృద్ధిని జగన్ అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. నేషనల్ నవక్రాంతి పార్టీ అధ్యక్షుడు కనకం శ్రీనివాసరావు, రెల్లి సంక్షేమ సంఘం నేత శిరంశెట్టి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు. అనంతరం కర్ణాటక తెలుగు ప్రజా సమితి ఆధ్వర్యంలో బెంగుళూరులో 'అభినవ జామవా' బిరుదు ఇచ్చిన సందర్భంగా బాలకోటయ్యను సత్కరించి అభినందించారు.

కేంద్ర బడ్జెట్‌కు నిరసనగా 28, 29 తేదీల్లో ప్రతుల దహనం

» రైతు సంఘాల చర్చావేదికలో తీర్మానం

గవర్నర్‌పేట, జూలై 26 : కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయం, గ్రామీణ పేదలకు నిధుల కేటాయింపులో భారీగా కోత విధించడాన్ని నిరసిస్తూ ఈనెల 28, 29 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా బడ్జెట్ ప్రతులను దహనం చేయాలని, ఎస్‌కేఎం దేశవ్యాప్త పిలుపులో భాగంగా ఆగస్టు 9న క్విట్ కార్పొరేట్ కార్యక్రమంలో పాల్గొనాలని రైతు సంఘాల ఆధ్వర్యంలో జరిగిన చర్చావేదిక ఏకగ్రీవంగా తీర్మానించింది. వ్యవసాయ రంగానికి, గ్రామీణ పేదలకు కేంద్ర బడ్జెట్‌లో భారీగా కోత పెట్టడానికి వ్యతిరేకంగా, పార్లమెంటు సమావేశాల్లో బడ్జెట్‌ను సవరించి నిధులు పెంచాలని కోరుతూ రైతు, వ్యవసాయ కార్మిక, కౌలు రైతు సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఎంజీ రోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య అధ్యక్షతన చర్చావేదిక జరిగింది. వివిధ సంఘాలకు చెందిన 50 మంది రాష్ట్ర ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు. ఆర్థిక నిపుణులు ప్రొఫెసర్ పాపారావు, మాజీ రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావులు పాల్గొని ప్రసంగించారు. కేంద్ర బడ్జెట్‌పై తయారు చేసిన నివేదికను వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు ప్రవేశపెట్టగా, కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు బలపరిచారు. చర్చావేదికలో చెరకు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్రాపు సూర్యనారాయణ, రైతు సంఘం సీనియర్ నాయకులు వై.కేశవరావు, రైతు కూలీ సంఘం గౌరవాధ్యక్షురాలు సింహాద్రి ఝాన్సీ, అక్కినేని భవానీప్రసాద్, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు, వివిధ సంఘాల నేతలు ప్రసంగించారు. పార్లమెంటు సమావేశాల్లో బడ్జెట్‌ను సవరించి వ్యవసాయ రంగానికి రూ. 5 లక్షల కోట్లు, ఆహార భద్రతకు రూ. 3 లక్షల కోట్లు, ఉపాధి హామీకి రూ. 2 లక్షల కోట్లు కేటాయించాలని సమావేశంలో తీర్మానించారు.



చర్చావేదికలో పాల్గొన్న వివిధ సంఘాల నేతలు

పౌష్టికాహారంపై అశ్రద్ధ వహిస్తే సహించేది లేదు : కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం టౌన్ , జూలై 25 : చిన్నారులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించాలని కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. పఠాన్‌పేట, రామరాజుపాలెం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాలను కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. విద్యావిధానం, గర్భవతులు, బాలింతలకు ఆరోగ్య పరిరక్షణపై ఆరా తీశారు. పిల్లలకు ఇచ్చే పోషకాహారం, రిజిస్టర్‌ను సరిగా నిర్వహించని రామరాజుపాలెం, పఠాన్‌పేట అంగన్వాడీ కార్యకర్తలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

అనంతరం కలెక్టర్ రామరాజుపాలెం మండల పరిషత్ పాఠశాలను సందర్శించి విద్యార్థులను గణితంపై ప్రశ్నలు అడిగారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఐసీడీఎస్ పీడీ సువర్ణ, సీడీపీవో గ్లోరీ, సూపర్‌వైజర్లు ఉషశ్రీ, రేవతి, డీవైఈవో శేఖర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

సాగు జరిగేనా?



హంసలదీవి సమీపంలో నీటమునిగిన పొలాలు

» పంట పొలాల్లో నిలిచిన వర్షపు నీరు

» శిథిలావస్థలో అవుట్ ఫాల్ స్లూయిస్ గేట్లు

» నీరు దిగువకు వెళ్లడం లేదని రైతుల ఆందోళన

కోడూరు : ఇటీవల కురిసిన వర్షాలకు కోడూరు దిగువ ప్రాంత భూముల్లో నీరు నిలిచిపోవటంతో ఈ ఏడాది ఖరీఫ్ సాగు జరిగేనా? అంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని హంసలదీవి, పాలకాయితిప్ప, దింటిమెరక, ద్వారకా



శిథిలావస్థలో ఉన్న అవుట్ పాల్ స్లూయిస్ గేట్లు

గ్రామాల సమీపంలో పొలాల్లోని వర్షపు నీరు బయటకుపోకుండా వర్షపునీరు నిలిచింది. పాలకాయితిప్ప అవుట్‌ఫాల్ స్లూయిస్, కోడూరు అవుట్‌ఫాల్ స్లూయిస్ గేట్లు పూర్తిగా పాడవటమే దీనికి ప్రధాన కారణమని రైతులు చెబుతున్నారు. అవుట్ ఫాల్ స్లూయిస్ గేట్లు పూర్తిగా లేని కారణంగా సముద్రపు పోట్లకు ఉప్పునీరు నేరుగా ఎగువకు రావటంతో పొలాల్లోని వర్షపు నీరు దిగువకు వెళ్లటం లేదని ఆందోళన చెందుతున్నారు. గత ఐదేళ్లలో కోడూరు మండల పరిధిలోని సుమారు 4 వేల ఎకరాల్లో సాగు జరగలేదని, ఈ సంవత్సరమైనా సాగు చేసేందుకు అవకాశం ఉంటుందని ఆశతో ఎదురుచూస్తున్నామని, ప్రస్తుతం కురిసిన వర్షానికి మా ఆశలు నిరాశలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై సంబంధిత డ్రెయినేజీ శాఖాధికారి వెంకటేశ్వరరావును వివరణ కోరగా, ఉప్పునీరు ఎగువకు రాకుండా పాలకాయితిప్ప అవుట్ ఫాల్ స్లూయిస్ వద్ద తాత్కాలికంగా ఇసుక మూటలు వేస్తున్నట్టు, శాశ్వత పరిష్కారానికి అవుట్ ఫాల్ స్లూయిస్ నిర్మాణ ఎస్టిమేట్లు వేసి ప్రభుత్వానికి అందించినట్టు తెలిపారు.

అధికారులు రక్షణ చర్యలు చేపట్టాలి

అడుసుమిల్లి సాయిబాబు



అవుట్‌ఫాల్ స్లూయిస్ గేట్లు పూర్తిగా పాడుకావటం వల్లే పొలాల్లోని నీరు దిగువకు పోవటం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు రక్షణ చర్యలు చేపట్టాలి.

బీడువారిన బతుకులు : పుల్లయ్య



గత నాలుగు సంవత్సరాలుగా సాగు భూమి బీడు మారి జీవనోపాధి లేక వలస వెళ్లాల్సిన పరిస్థితి.. ఈ సంవత్సరమైనా సాగు చేద్దామంటే వర్షపు నీటితో పొలాల్లో మునిగిపోయాం, ప్రభుత్వమే ఆదుకోవాలి.





ఇంట్లో నిర్జీవంగా పడి ఉన్న శ్రీహరిరావు (ఫైల్‌ఫొటో)

44 నెలల తర్వాత..

» సీబీసీఐడీకి డాక్టర్ శ్రీహరిరావు హత్య కేసు

» వైసీపీ ప్రభుత్వంలో పురోగతి లేని కేసు

» స్పందించిన కూటమి ప్రభుత్వం

అవనిగడ్డ, జూలై 26 : వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎలాంటి పురోగతి లేకుండా పడిఉన్న డాక్టర్ శ్రీహరిరావు హత్య కేసును కూటమి ప్రభుత్వం సీబీసీఐడీకి అప్పగించటంతో 44 నెలల తర్వాత కేసు ఫైలు ముందుకు కదిలింది. కృష్ణా జిల్లావ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన డాక్టర్ శ్రీహరిరావు హత్యోదంతంలో వైసీపీ ప్రభుత్వం, పోలీసుల నిర్లిప్త వైఖరిపై తీవ్ర స్థాయిలో దుమారం రేగింది. జిల్లాలో మంచి వైద్యుడిగా గుర్తింపు పొందిన డాక్టర్ శ్రీహరిరావును 2020నవంబర్ 27వ తేదీ అర్ధరాత్రి ఆయన ఇంటి వద్దే దుండగులు హత్య చేశారు. నాటి ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబుకు అత్యంత సన్నిహితుడిగా, వ్యాపార భాగస్వామిగా ఉన్న డాక్టర్ శ్రీహరిరావు హత్య జరిగిన రోజు రాత్రి అవనిగడ్డ ప్రధాన సెంటర్‌లో సీసీ కెమెరాలు పనిచేయకపోవటం, కొన్ని నెలలపాటు కేసులో ఏలాంటి పురోగతి లేకపోవటం.. రాజకీయ కోణంపై నియోజకవర్గ వ్యాప్తంగా పెద్ద ఎత్తున చర్చ జరిగింది. సీసీ కెమెరా నిఘాను తప్పించుకుని దుండగులు ఆయన ఇంట్లోకి చొరబడి డాక్టర్‌ను హత్య చేయటంతో ఆయనతో సన్నిహితంగా ఉండే వారు చేసిన పనే అని స్థానికులు భావిస్తున్నారు.

ముందుకు సాగని దర్యాప్తు..

డాక్టర్ శ్రీహరిరావు హత్య జరిగిన వెంటనే నాటి జిల్లా ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు, అప్పటి డీఎస్పీ మెహబూబ్‌బాషాలు సంఘటనా స్థలాన్ని పరిశీలించి నిందితులను వెంటనే పట్టుకుంటామని ప్రకటించారు. హత్య జరిగి సంవత్సరాలు గడిచిపోతున్నా ఒక్క అనుమానితుడిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకోకపోవటంతో నియోజకవర్గంలో చర్చనీయాంశమైంది. తెలుగుదేశం, జనసేన పార్టీలు హత్య ఉదంతంపై సీఐడి దర్యాప్తును, బుద్ధప్రసాద్ గూగుల్ టే అవుట్ పద్ధతిలో దర్యాప్తు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే డాక్టర్ శ్రీహరిరావు హత్య కేసులో నిందితులను తేలుస్తామని ఎన్నికల ప్రచారంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ బహిరంగ సభలో ప్రకటించారు. దాదాపు 44 నెలల క్రితం జరిగిన హత్యపై ఎలాంటి పురోగతి లేకుండాపోయిన కేసును రాష్ట్ర ప్రభుత్వం సీబీసీఐడికి అప్పగిస్తూ శుక్రవారం నిర్ణయం తీసుకోవటంతో స్థానికంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.



గన్నవరం కోర్టు వద్ద పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్, టీడీపీ నేతలు

టీడీపీ నేతలపై కేసు కొట్టివేత

గన్నవరం/పెనమలూరు, జూలై 26 : టీడీపీ నాయకులపై నమోదు చేసిన అక్రమ కేసును గన్నవరం కోర్టు శుక్రవారం కొట్టివేసింది. గతేడాది ఫిబ్రవరి 20వ తేదీన గన్నవరంలోని టీడీపీ కార్యాలయంపై మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అనుచరులు దాడికి పాల్పడ్డారు. కార్యాలయ ఆవరణలో కారుకు నిప్పటించటంతో పాటు పలు కార్లను ధ్వంసం చేశారు. అడ్డొచ్చిన టీడీపీ కార్యకర్తలను కొట్టారు. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోడె ప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకుని వైసీపీ మూకల దాడులను విలేకరుల సమావేశం ద్వారా ఖండించారు. దీనిపై బోడె ప్రసాద్‌తో పాటు టీడీపీ నేతలు గరిమెళ్ల నరేంద్ర చౌదరి, పుట్టా సురేష్, పొట్లూరి వెంకట సుధీర్, పెందుర్తి శ్రీకాంత్, కంచర్ల సూర్యప్రకాష్, యార్లగడ్డ మోహన కృష్ణ, అట్లూరి శ్రీనివాస్, కొలుసు వరప్రసాద్, మేకల కోటేశ్వరరావు, పిడికిటి సతీష్‌బాబు, కుందేటి రఘుబాబులపై గన్నవరం స్టేషన్‌లో అక్రమ కేసులు నమోదు చేశారు. 12మందిపై గన్నవరం జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో చార్జిషీటు దాఖలు చేయగా సాక్షులను కోర్టు విచారించింది. నేరం రుజువు కాకపోవటంతో న్యాయాధికారి సీహెచ్ శ్రీనివాసబాబు కేసును కొట్టివేస్తూ తీర్పునిచ్చారు. కేసులో తమ వాదనలను బలంగా వినిపించిన టీడీపీ లీగల్ సెల్ న్యాయవాదులు సుంకర వెంకట సురేష్, శౌంరి వీరబాబులకు టీడీపీ నేతలు కృతజ్ఞతలు తెలిపారు.



ఇసుక స్టాక్ యార్డును పరిశీలిస్తున్న అధికారులు

నిబంధనలు పాటించండి

జగ్గయ్యపేట రూరల్, జూలై 26: ప్రాధాన్యతాక్రమంలో వాహనాలకు ఇసుక లోడింగ్ చేసి పంపాలని తహసీల్దార్ శేషగిరి సూచించారు. అనుమంచిపల్లి ఇసుక స్టాకుయార్డును ఎంపీడీవో రమేష్‌తో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. ఇసుక పంపిణీలో అక్రమాలు జరుగుతున్నాయని వస్తున్న సమాచారంతో అప్రమత్తమైన అధికారులు రవాణా బిల్లుల పంపిణీ తదితర అంశాలపై వివరాలు సేకరించారు. లారీలకు ఇసుక ఎత్తవద్దని లబ్ధిదారులకు ట్రాక్టర్ల ద్వారానే పంపిణీ చేయాలన్నారు. స్టాకు యార్డు వద్ద విధులకు డుమ్మా కొట్టిన అధికారుల వివరాలు సేకరించిన సమాచారాన్ని నందిగామ ఆర్డీవోకు అందించామని ఆయన ఆదేశాల మేరకు తదుపరి చర్యలుంటాయని తహసీల్దార్ తెలిపారు.

ముగ్గురిపై కేసు నమోదు..

ఒకే వే బిల్లుపై రెండు ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తున్నారన్న ఎస్ఈబీ సీఐ మణికంఠరెడ్డి ఫిర్యాదు మేరకు రెండు ట్రాక్టర్లతో పాటు ముగ్గురిపై 337, 318(4), 303(2) బిఎన్ఎస్ 27 ఓల్టా చట్టం కింద కేసు నమోదు చేసినట్టు చిల్లకల్లు ఎస్ఐ సతీష్ తెలిపారు. బలుసుపాడుకు చెందిన లింగం లింగారావు, గుంజా వెంకన్నలు ఇసుకను తరలిస్తుండగా ఎస్ఈబీ అధికారులు పట్టుకున్నారు. స్టాకు యార్డు వద్ద అనధికారికంగా విధులు నిర్వహిస్తున్న షేక్ సైదా సహా ముగ్గురిపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	109, 118, 129
చికెన్ విత్ స్కిన్	206
చికెన్ స్కిన్‌లెస్	216

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.80

గ్రామాల్లో సూపర్‌స్పెషాలిటీ వైద్యసేవలు అభినందనీయం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 26 : గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ఉచిత వైద్యశిబిరాల ద్వారా సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని రాష్ట్ర సాగునీటి సమాఖ్య అధ్యక్షుడు ఆళ్ల గోపాలకృష్ణ అన్నారు. రంగన్నగూడెంలో పిన్నమనేని సిద్ధార్థ సూపర్‌స్పెషాలిటీ వైద్యశాల, చినఅవుటపల్లి సహకారంతో శుక్రవారం ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో కీళ్ల వ్యాధులను డాక్టర్ అభిషేక్, డాక్టర్ నిఖిల్, కంటి వైద్య పరీక్షలను డాక్టర్ సుభాషిణి, డాక్టర్ గీత, జనరల్ మెడిసిన్‌కు సంబంధించి డాక్టర్ ఎం.ఎ. సమీరా, డాక్టర్ ఎస్. కార్తీక్ తదితరులు 175మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఆస్పత్రి అందించిన మందులను ఆళ్ల గోపాలకృష్ణ, సర్పంచ్ రంగామణి, ఎంపీటీసీ పుసులూరి లక్ష్మీనారాయణ పంపిణీ చేశారు.

ఆపద్బాంధవుడు ఎమ్మెల్యే యార్లగడ్డ

టీడీపీ మండల అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు

గన్నవరం, జూలై 26 : రైతులకు ఆపద్బాంధవుడిలా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు నిలిచారని టీడీపీ మండల అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు అన్నారు. రూ.కోటితో మోటార్లు కొనుగోలు చేసి రైతులకు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అందజేయగా మండలంలోని కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన మోటార్లను శుక్రవారం జాస్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతుల పక్షాన టీడీపీ ఎప్పుడు ఉంటుందన్నారు. 120 రోజుల్లో పట్టిసీమను పూర్తి చేసి గోదావరి జలాలను కృష్ణానదికి అనుసంధానం చేయటంతో పాటు అన్నదాతలకు నీరు అందజేసిన ఘనత చంద్రబాబు నాయుడుకే దక్కిందన్నారు. ఎన్నికల ముందు యార్లగడ్డను రైతులు మోటార్లు అందజేయాలని కోరారు. ఎట్టి పరిస్థితుల్లోనైనా ఇచ్చి తీరతానని చెప్పి ఆ హామీని నిలబెట్టుకున్నారని తెలిపారు. రైతుల కష్టాలు, బాధలు ఎరిగిన వ్యక్తి ఎమ్మెల్యే యార్లగడ్డ అని చెప్పారు. తెలుగు రైతు, మండల అధ్యక్షులు ఆరుమళ్ల కృష్ణారెడ్డి, జూపల్లి సురేష్, మండవ అన్వేష్, చీమలదండు రామకృష్ణ, పోతురాజు, హేమంత్, రాంబాబు, గోపీ పాల్గొన్నారు.



కొత్తగూడెంలో మోటార్లు ఆన్ చేస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు



పనులను పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

పారిశుధ్య పనుల పరిశీలన

పెనమలూరు, జూలై 26 : తాడిగడప మునిసిపాలిటీలో గత పది రోజులుగా జరుగుతున్న పారిశుధ్య పనుల స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా మునిసిపాలిటీలోని క్లస్టర్లను కమిషనర్ వెంకటేశ్వరరావు శుక్రవారం పరిశీలించారు. తాడిగడప సర్కిల్‌లో కాల్వల్లోని సిల్టు తియ్యడం, యాంటీ లార్వా స్ప్రేయింగ్, ఆటో టిప్పర్ డోర్ కలెక్షన్, రోడ్ల స్వీపింగ్ పనులను ఆయన పర్యవేక్షించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, డోర్ కలెక్షన్, యాంటీ లార్వా స్ప్రేయర్ తదితర పనులను వందశాతం పూర్తి చేయాలని ఆదేశించారు. కానూరులో జరుగుతున్న డ్రెయినేజీ, రోడ్డు పనులను కమిషనర్ పరిశీలించారు. ఆర్వో సాయి, ఆర్ఐలు, స్థానిక టీడీపీ నాయకులు అంగిరేకుల మురళి, తుమ్మల రాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలపై పర్యవేక్షణ చేయాలి

డీఈవో తాహెరా సుల్తానా

ఈడుపుగల్లు (కంకిపాడు), జూలై 26 : ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలపై మండల విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి తాహెరా సుల్తానా అన్నారు. నలంద హైస్కూల్‌లో జిల్లాలోని మండల విద్యాశాఖ అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ప్రమాణాలకు అనుగుణంగా అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఈడుపుగల్లు (కంకిపాడు), జూలై 26 : ప్రభుత్వ సహకారంతో పాటు దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కంకిపాడు మాజీ ఎంపీపీ దేవినేని రాజా అన్నారు. మండలంలోని ఈడుపుగల్లు ప్రైమరీ పాఠశాల విద్యార్థులకు దాతల సహకారంతో ఏర్పాటు చేసిన డైరీలను ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పందిపాటి ఇందిర, ఉప సర్పంచ్ కిలారు శ్రీను, టీడీపీ జిల్లా కార్యదర్శి పందిపాటి సుధాకర్, గ్రామ టీడీపీ అధ్యక్షుడు షేక్ షకార్, సుంకర శ్రీహరి, ఉపాధ్యాయులు పి. రూపారాణి, మండవ వెంకట శ్రీనివాసు, మీనా కుమారి పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామికి విరాళం

హనుమాన్‌జంక్షన్, జూలై 26 : రాజమండ్రికి చెందిన భక్తుడు సాయినిఖిల్ రెడ్డి స్థానిక అభయాంజనేయస్వామి ఆలయానికి శుక్రవారం రూ.2 లక్షల విరాళం అందజేశారు. దాత విరాళాన్ని నగదు రూపంలో అందించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శ్రీనివాసాచార్యులు, పవన్ కుమార్ చార్యులు దాత పేరిట తమలపాకులతో పూజలు జరిపించి అభినందించారు.

బాపులపాడు ఎంపీపీకి మాతృవియోగం

హనుమాన్‌జంక్షన్, జూలై 26 : బాపులపాడు ఎంపీపీ వై.నగేష్‌కు మాతృవియోగం కలిగింది. నగేష్ తల్లి నాగమ్మ(80) కొన్ని రోజులుగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతుంది. గురువారం రాత్రి తుదిశ్వాస విడిచింది. నాగమ్మ అంత్యక్రియలు ఆమె స్వగ్రామం ప్రకాశం జిల్లా దొండపాడులో శనివారం నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. నాగమ్మ పార్థీవదేహం వద్ద వైసీపీ, టీడీపీ నాయకులు నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

పాఠశాలలకు విత్తనాలు అందజేత

గన్నవరం, జూలై 26 : రోటరీ క్లబ్ ఆఫ్ గన్నవరం ఆధ్వర్యంలో మండలంలోని 8 ప్రభుత్వ పాఠశాలలకు కిచెన్ గార్డెన్‌కు విత్తనాలను శక్రవారం అందజేశారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు టీఎస్ఆర్‌కె ప్రసాద్, కార్యదర్శి రవిబాబు మాట్లాడుతూ, విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించేందుకు తమవంతు కృషి చేస్తున్నామ న్నారు. పాఠశాలలో కిచెన్ గార్డెన్‌లు పెంచాలని సూచించారు. రిటైర్డ్ ఉపాధ్యాయురాలు సరస్వతి పాఠశాల అభివృద్ధికి రూ.లక్ష చెక్కును ఇన్‌చార్జి హెచ్‌ఎం పి.రమాదేవికి అందజేశారు. శ్రీకర్, మాణిక్యలరావు, కాసన్నేని బాబూరావు పాల్గొన్నారు.

హెల్మెట్‌తో ప్రాణాలకు భద్రత



హెల్మెట్ వాడకంపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

ఉంగుటూరు, జూలై 26 : రోడ్లపై ద్విచక్రవాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అనుకోని ప్రమాదం జరిగితే ప్రాణాలకు భద్రత కల్పిస్తుందని తేలప్రోలు ఉషారామా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జీవీకేఎస్‌వీ ప్రసాద్ అన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు హెల్మెట్ ఉపయోగంపై అవగాహన కల్పించేందుకు శుక్రవారం ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు. సేఫ్టీ ఫస్ట్ హెల్మెట్ మస్ట్, హెల్మెట్ ధరించండి, సురక్షితంగా ఇంటికి చేరండి, నేను నా కుటుంబాన్ని ప్రేమిస్తున్నా, అందుకే హెల్మెట్ ధరిస్తున్నా అనే నినాదాలతో స్థానిక కళాశాల నుంచి ప్రారంభమైన ఈ ప్రదర్శన జాతీయ రహదారి మీదుగా పొట్టిపాడు వరకు కొనసాగింది. ఎన్ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వి.శ్రీహరిబాబు మాట్లాడుతూ, హెల్మెట్ వాడకంపై ద్విచక్రవాహనదారులు అవగాహన కలిగివుండాలన్నారు. ఆగస్టు 1నుంచి హెల్మెట్ ధరించకుండా బైక్‌లు నడిపితే వెయ్యిరూపాయల జరిమానా తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అండర్ ఆఫీసర్ ఎం.భాను పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



కోడూరుపాడులో జనసేన సభ్యత్వ నమోదు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 26 : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్న జనసేన పార్టీ సభ్యత్వం తీసుకోవడం ద్వారా పవన్‌కల్యాణ్ నేతృత్వంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని గరికపాటి నాగు అన్నారు. కోడూరుపాడులో జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో శుక్రవారం ఆయన పాల్గొన్నారు. గ్రామంలో 130 మందికి ఇప్పటి వరకూ సభ్యత్వాలు అందజేసినట్లు తెలిపారు. జనసైనికుల కుటుంబాలకు కూడా అండగా ఉండేలా రూ.500తో క్రియాశీలక సభ్యత్వ నమోదు చేసుకున్న వారికి రూ.5లక్షల బీమా సౌకర్యం వర్తిం చేలా అధినాయకత్వం చర్యలు తీసుకుందని వివరించారు. ఈ కార్యక్రమంలో బాడిగ కుమార్, నవీన్, నాగరాజు, వాసు, నరహరిశెట్టి సాయికుమార్, అంబటి రాజేష్, శేషు, తదితరులు పాల్గొన్నారు.

బండారుగూడెంలో డ్రెయినేజీ పూడికతీత

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]



హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 26 : బండారుగూడెంలో డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులపై 'పారిశుధ్య పనులు చేపట్టండి' అని ఆంధ్రజ్యోతిలో గురువారం ప్రచురితమైన కథనా నికి అధికారులు స్పందించారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు పర్యవేక్షణలో పంచాయతీ సిబ్బంది, జేసీబీతో డ్రెయిన్ పూడికతీత పనులను శుక్రవారం మొదలు పెట్టారు. పారిశుధ్య పనులు చేపట్టడంపై సీపీఎం నాయకుడు బర్రె లెనిన్, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

భువనేశ్వరీ అమ్మవారికి సారె సమర్పణ

గన్నవరం, జూలై 26 : మండలంలోని కేసరపల్లి చిదానంద ఆశ్రమంలోని భువనేశ్వరీ మాత అమ్మవారికి శుక్రవారం బుద్ధవరం గ్రామం నుంచి సారెను సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని విశేష పూజలు చేశారు. మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు గూడవల్లి నాగేశ్వరరావు, భవాని, రాజేశ్వరీ, భారతీ, గూడవల్లి శివరామకృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో సారెను సమర్పించారు. భువనేశ్వరీ పీఠంలో పూజలు చేసి హోమాలు జరిపారు. భువనేశ్వరీ పీఠాధిపతి కమలానంద భారతీస్వామి ప్రత్యేక పూజలు చేశారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : వీరవల్లిలోని తిరుపతమ్మతల్లి, గోపయ్య స్వామి ఆలయంలో స్వామివార్లకు శుక్రవారం కలపాల నాని సహకారంతో శాకంబరీ అలంకరణ నిర్వహించారు. ఆలయ ఆవరణతో పాటు అమ్మవారికి, స్వామివార్లకు వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో ప్రత్యేకంగా అలంకరించారు. శాకంబరీ అలంకరణలోని స్వామివార్లను దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు అవసర మైన ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు నందమూరి మురళీకృష్ణప్రసాద్, తదితరులు పర్యవేక్షించారు.

నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి

గన్నవరం, జూలై 26 : ఇళ్ల వద్ద నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సర్పంచ్ నిడమర్తి సౌజన్య అన్నారు. పట్టణంలో వైద్యశాఖ ఆధ్వర్యాన, డెంగ్యూ నివారణ మాసోత్సవ ర్యాలీని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సౌజన్య మాట్లాడుతూ,నీటి నిల్వలు ఉంటే దోమలు వృద్ధి చెందుతాయని, మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా వ్యాధులకు కారణమవు తాయని పట్టణ ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం ఏఎన్ఎం, ఆశా వర్కర్‌లు ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి అనిల్ కుమార్, షూకుర్, నిడమర్తి నాగేశ్వరరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



డెంగ్యూ నివారణ మాసోత్సవ ర్యాలీలో సర్పంచ్ సౌజన్య

యువకుడు అనుమానాస్పద మృతి



కొమ్ము గాంధీ

కంకిపాడు, జూలై 26 : యువకుడు అనుమానాస్పద మృతి చెందిన ఘటన మండలంలోని కోలవెన్ను - కుందేరు మార్గమధ్యలో శుక్రవారం తెల్లవారు జామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉయ్యూరుకు చెందిన కొమ్ము జయరాజు కుమారుడు గాంధీ (21) కోలవెన్నులోని చిన్నమ్మ జ్యోత్స్న ఇంటి వద్ద ఉండి తాపీపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతడు అవి వాహితుడు కావటంతో 20 రోజుల నుంచి చిన్నమ్మ ఇంటి వద్దే ఉంటూ పనులు చేసుకుంటున్నాడు. యథావిధిగా గురువారం ఉదయం తాపీ పనికి వెళ్లి సాయంత్రం ఇంటికి తిరిగి రాలేదు. శుక్రవారం ఉదయం కోలవెన్ను - కుందేరు మార్గమధ్యలో పొలం గట్టుమీద శవమై కనిపించాడు. దీంతో సమాచారం అందుకున్న కంకిపాడు ఎస్సై 2 తాతాచార్యులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దాడి కేసులో నలుగురికి జరిమాన

ఉయ్యూరు, జూలై 26 : మహిళపై దాడికి సంబంధించిన కేసులో నలుగురు ముద్దాయిలకు కోర్టులో రూ.8 వేలు జరిమానా విధించినట్టు ఉయ్యూరు రూరల్ ఎస్సై అవినాశ్ శుక్రవారం తెలిపారు. కాటూరు బీసీ కాలనీకి చెందిన ధనికొండ వెంకటేశ్వరమ్మ తమ్ముడు నాగరాజుపై అదే ప్రాంతానికి చెందిన ఓసూరి వెంకట రమణ, నాగరాజు, చంటమ్మ, ధనికొండ వరలక్ష్మి దాడి చేస్తుంటే వెంకటేశ్వరమ్మ అడ్డువెళ్లగా ఆమెపైన కూడా దాడి చేసినట్టు చేసిన ఫిర్యాదు మేరకు 2019లో కేసు నమోదు చేశారు. ఈ కేసు సంబంధించి ముద్దాయిలకు విజయవాడ 4వ అదనపు మెజిస్ట్రేట్ కోర్టులో ఒక్కొక్కరికి రూ. 2వేల చొప్పున జరిమానా విధిస్తూ ఆ మొత్తం వెంకటేశ్వరమ్మకు చెల్లించాలని న్యాయాధికారి రామ్మోహనరావు తీర్పు ఇచ్చినట్టు ఎస్సై తెలిపారు.

లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదు



యువకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఉయ్యూరు పట్టణ ఎస్సై గణేశ్‌కుమార్

ఉయ్యూరు, జూలై 26 : లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదని, అందుకు చట్టపరంగా జరిమానా ఉంటుందని పట్టణ ఎస్సై గణేశ్‌కుమార్ హెచ్చరించారు. కళాశాల రోడ్డులో లైసెన్స్ లేకుండా ద్విచక్రవాహనాలు నడుపుతూ పట్టుబడ్డ యువకులకు శుక్రవారం కౌన్సెలింగ్ ఇచ్చి జరిమానా విధించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నపడరాదని, ప్రమాదాలు జరిగినప్పుడు చట్టపరంగా చర్యలు ఉంటాయన్నారు. మద్యం, మత్తు పదార్థాలు సేవించి వాహనాలు నడపడం నేరమని, వాటికి యువత దూరంగా ఉండాలన్నారు. లైసెన్స్ లేకుండా వాహనం నడుపుతూ రెండవ సారి పట్టుబడితే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ



పోరంకి గ్రీన్ స్కూల్‌లో కార్గిల్ విజయ్‌దివస్

పెనమలూరు, జూలై 26 : కార్గిల్ యుద్ధంలో దేశం కోసం పోరాడి ప్రాణాలు సైతం లెక్కచేయకుండా దేశభక్తిని చాటిన ఎంతో మంది అమరవీరుల త్యాగాలను స్మరించుకొంటూ కార్గిల్ విజయ్ దివస్ రోజును శుక్రవారం పోరంకి గ్రీన్ స్కూల్ విద్యార్థులు వినూత్నంగా జరుపుకొని తమ దేశభక్తిని చాటుకొన్నారు. విద్యార్థులు వారి కిడ్డీ బ్యాంకులో దాచుకొన్న సొమ్ముతో కార్గిల్ విజయ్‌దివస్‌ను పురస్కరించుకొని కానూరు మధురలోగిలి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు, వితంతువులకు అన్నదానం, వస్త్రదానంతో పాటు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సాయిఅపర్ణ, చైర్మన్ వంశీకృష్ణ, డైరెక్టర్ శాంతిపాల్గొన్నారు.

● కానూరు అశోక్‌జిమ్ ఆధ్వర్యంలో నేహ్రూ యువజన కేంద్రం, జిల్లా యువజన సర్వీసుల శాఖ సహకారంతో జరిగిన కార్గిల్ విజయ్‌దివస్ కార్యక్రమంలో అమరవీరుల చిత్రపటానికి లయన్స్ క్లబ్ వైష్ణవి నరేంద్ర పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తాళ్లూరి అశోక్, ఈదా రాజేష్, శ్రీను, మాతృహృదయ్ స్వచ్ఛంద సేవా సంఘ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తక్కువ ధరకే నిత్యావసరాలు

ఉయ్యూరు, జూలై 26 : బియ్యం, కందిపప్పు తదితర నిత్యావసరాలు తక్కువ ధరకు అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం రిలయన్స్ స్మార్ట్‌తో పాటు, కొన్ని షాపులు, రైతుబజార్‌లలో ప్రత్యేక షాపులు ఏర్పాటు చేసిందని లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ టి.రాజేంద్రప్రసాద్ అన్నారు. స్థానిక రిలయన్స్ స్మార్ట్‌లో ప్రభుత్వం తక్కువ ధరలకు ఏర్పాటు చేసిన నిత్యావసర సరుకుల విక్రయ ప్రక్రియను శుక్రవారం తనిఖీ చేశారు. కన్స్యూమర్ అసోసియేషన్ సభ్యుడు బాజీ, పౌరసరఫరాల టెక్నికల్ అసిస్టెంట్ బి.మూర్తినాయక్ పాల్గొన్నారు.



రిలయన్స్ మార్ట్‌లో రాయితీపై నిత్యావసరాల విక్రయాలను పరిశీలిస్తున్న లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ టి.రాజేంద్రప్రసాద్

కృష్ణా

• మచిలీపట్నం • పెడన • గుడివాడ • పామర్రు • అవనిగడ్డ

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	109, 118, 129
చికెన్ విత్ స్కిన్	206
చికెన్ స్కిన్‌లెస్	216

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.4.80

ఆరోగ్యమే మహాభాగ్యం



మచిలీపట్నం టౌన్, జూలై 26 : ఆరోగ్యమే మహాభాగ్యమని జిల్లా న్యాయాధికారి అరుణసారిక అన్నారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కోర్టు ఆవరణలో టాప్ స్టార్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని అరుణసారిక ప్రారంభించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బూరగడ్డ అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శి సిద్ధినేని సాయిబాబు ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ నారాయణరావు, డాక్టర్ శిరీష, శంకరరావు, డాక్టర్ రాఘవేంద్రరావు, డాక్టర్ ఏ. దీప్తి పరీక్షలు నిర్వహించారు. న్యాయవాదులు సోడిశెట్టి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



మడ అడవుల పరిరక్షణ కోరుతూ గిలకలదిండిలో విద్యార్థుల ర్యాలీ

మడ అడవులను కాపాడుకుందాం

మచిలీపట్నం టౌన్ : మడ అడవులను కాపాడుకుందామని జిల్లా అటవీ శాఖాధికారి రాజశేఖరరావు అన్నారు. మడ అడవుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా అటవీ శాఖాధికారి రాజశేఖరరావు ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించి, గిలకలదిండి మునిసిపల్ హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. అటవీ శాఖాధికారులు సుజాత, షరీఫ్, సామాజిక వన పథకం అధికారి వెంకటేశ్వరరావు, ఉప అటవీ క్షేత్ర అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చంద్రబాబు, పవన్ కల్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం



నాగాయలంక : కూటమి ప్రభుత్వంతోనే మత్స్యకారుల అభివృద్ధి సాధ్యమవుతుందని మత్స్యకార సంఘం నేత, జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యదర్శి లకనం నాగాంజనేయులు అన్నారు. మత్స్యకారుల జీవనోపాధిని దెబ్బతీసే జీవో 217ను రద్దు చేస్తున్నట్లు మత్స్యశాఖ మంత్రి అచ్చెన్నాయుడు అసెంబ్లీలో ప్రకటించిన నేపథ్యంలో శుక్రవారం నాగాయలంకలోని మత్స్యభవనం వద్ద చంద్రబాబు, పవన్ కల్యాణ్ చిత్రపటాలకు మత్స్యకార నాయకులతో కలిసి పాలాభిషేకం చేసి ధన్యవాదాలు తెలిపారు. టీడీపీ మత్స్యకార విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు కర్రి కృష్ణమూర్తి, నాయకులు లంకే శ్రీనివాస ప్రసాద్, నందాడి గొందియ్య, పీతా సుబ్బారావు, మత్స్యకార సంఘాల నాయకులు పాల్గొన్నారు.



జనసేన సభ్యులకు రూ.5 లక్షల బీమా

మచిలీపట్నం టౌన్ : జనసేన క్రియాశీల సభ్యులకు రూ.5 లక్షల ప్రమాద బీమా కల్పిస్తామని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ అన్నారు. నాల్గో డివిజన్ జనసేన కార్పొరేటర్ పినిశెట్టి చాయాదేవి ఆధ్వర్యంలో జనసేన క్రియాశీలక సభ్యత్వ కార్యక్రమం శుక్రవారం జరిగింది. రామకృష్ణ మాట్లాడుతూ, ఈ నెల 28వ తేదీతో జనసేన క్రియాశీల సభ్యత్వ నమోదు గడువు పూర్తవుతుందన్నారు. ఆన్‌లైన్ యాప్‌లో జనసేన కార్యకర్తలు అందుబాటులో ఉండాలన్నారు. జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు, నాయకులు పినిశెట్టి వేణు, తోట యశ్వంత్, మహమ్మద్ సమీర్, తోట రాజేష్, శాయన శివయ్య, కర్రి మహేష్, వడ్డి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

గుడివాడ : శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణ ఎంటర్‌ప్రైజెస్ అధినేత పల్లపోతు వెంకట నాగబాబు కుమార్తె జోష్నశ్రీ పుట్టినరోజు సందర్భంగా ఎస్‌పీఎస్ ఉన్నత పాఠశాల, కళాశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు, స్టేషనరీ పంపిణీ చేశారు. ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి, వ్యవసాయాధికారి బి.అనంతలక్ష్మీ ముఖ్య అతిథులుగా పాల్గొని పుస్తకాలను పంపిణీ చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ రాణి, నవభారత్ ఖాదీ స్టోర్స్ అధినేత సయ్యద్ గఫార్, సంఘం సభ్యులు తిరుపతయ్య, తోట రాజు, దొండపాటి అర్జున్, తాతారావు, నాగమణి, హరిబాబు, పి.ఇ.టి మడకా ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా కృష్ణావర్సిటీలో మాజీ సైనికులను సత్కరిస్తున్న నేతలు



బంటుమిల్లి డిగ్రీ కళాశాలలో అమర సైనికులకు విద్యార్థుల సెల్యూట్

ఘనంగా కార్గిల్ విజయ్ దివస్

మచిలీపట్నం టౌన్, జూలై 26 : కార్గిల్ వీరుల త్యాగాలు మరువలేమని కేయు వీసీ శ్రీనివాసాచార్యులు అన్నారు. కృష్ణా యూనివర్శిటీలో శుక్రవారం యువ మోర్చా ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా దేశ రక్షణకు సేవలందించిన మాజీ సైనికులు శరత్‌బాబు, వసంతరావు, డి.జగ్గారావు, ఎండి హుస్సేన్, కె.విఠల్, ఎం.ప్రేమ్‌కుమార్, ఆర్.ప్రతాప్, కె.దాస్, టి.శ్రీనివాస్‌లను ఘనంగా సత్కరించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, టీడీపీ రాష్ట్ర నాయకుడు కొనకళ్ల బుల్లయ్య, కేయు రిజిస్ట్రార్ శోభన్‌బాబు, యువమోర్చా జిల్లా అధ్యక్షుడు నాగలింగం అయోధ్య రామచంద్రరావు, పంతం గజేంద్ర, గంటా సతీష్, జనసేన నాయకుడు గడ్డం రాజు పాల్గొన్నారు. **బంటుమిల్లి** : విద్యార్థులు దేశ భక్తిని కలిగి ఉండాలని బంటుమిల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జగన్మోహనరావు అన్నారు. కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా కళాశాలలో కార్గిల్ పోరాటంలో అమరులైన వీర జవాన్లకు నివాళులర్పించి సెల్యూట్ చేశారు. అధ్యాపకులు సుజాత, విద్యార్థులు పాల్గొన్నారు. **అవనిగడ్డ** : టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్‌ను అవనిగడ్డలో ఘనంగా నిర్వహించారు. కార్గిల్ అమరవీరులకు ఘన నివాళులర్పించారు. బండే రాఘవ, బచ్చు రఘునాథ్, మేడికొండ విజయ్, అడపా శ్రీను, ఘంటసాల రామ్మోహనరావు, ఏడుకొండలు, మండలి రామ్మోహనరావు, అన్నపరెడ్డి లక్ష్మీనారాయణ, లుక్కా పిచ్చియ్య, లుక్కా శ్రీను, చెన్ను బాబురావు, లింగం బాబురావు, దానినేని శ్రీనివాసరావు, యలవర్తి చిన్నా, రేపల్లె రామ్మోహనరావు, మెగావత్తు గోపి, హరిబాబు, సాయి, తండు గంగాధర్, విజయ్, గోసాల బాలకోటి, అంకినీడు, వాసు, ఇమ్మానియేలు, పాండు రంగారావు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

కోడూరు : ఎలుకల మందు తిని వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఉల్లిపాలెంలో శుక్రవారం జరిగింది. గ్రామానికి చెందిన మద్దాల సతీష్‌తో ఇందిరాదేవి (23)కి ఆరు సంవత్సరాల క్రితం వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలు. పుట్టింటికి వెళ్లవద్దని అల్లుడు సతీష్ వేధిస్తుండడంతో తన కుమార్తె ఎలుకల మందు తిని చనిపోయిందని మృతురాలి తండ్రి కంబాల శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ టి.శ్రీనివాసరావు శవ పంచనామా చేసిన అనంతరం రమాదేవి మృతదేహాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై శిరీష తెలిపారు.

కడుపునొప్పి తాళలేక ఆత్మహత్య

నాగాయలంక : వక్కపట్లవారిపాలెం పంచాయతీ శివారు బ్రహ్మానందపురానికి చెందిన పులవర్తి రవి (56) కడుపునొప్పి తాళలేక పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పురుగు మందు తాగిన రవిని కుటుంబసభ్యులు హుటాహుటిన అవనిగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య పులవర్తి నారాయణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుబ్రహ్మణ్యం తెలిపారు.

బైక్ ఢీకొని సైక్లిస్టుకు గాయాలు

మోపిదేవి : మెరకనపల్లి గ్రామానికి చెందిన తాపీ మేస్త్రి హనుమంతరావు పని ముగించుకుని మోపిదేవి నుంచి మెరకనపల్లి వెళ్తుండగా ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన హనుమంతరావును 108 అంబులెన్స్‌లో అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించి పోలీసులు కేసు నమోదు చేశారు.

మద్యం స్వాధీనం

నాగాయలంక : రేమాలవారిపాలెం వంతెన వద్ద పోలీసులు శుక్రవారం వాహనాలు తనిఖీలు నిర్వహించి, ఎదురుమొండి శివారు కృష్ణాపురానికి చెందిన ఆరుంబాక సుబ్బారావు వద్ద 15 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సుబ్రహ్మణ్యం తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పెదపారుపూడి : మండల పరిధిలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గుడివాడ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి.రామకృష్ణ తెలిపారు. విద్యుత్ లైన్లు, విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, విద్యుత్ వినియోగదారులు, ప్రజలు గమనించి సహకరించాలని ఆయన కోరారు.



సీతమ్మకు సారె తెస్తున్న మంత్రి రవీంద్ర సతీమణి నీలిమ



గుడ్లవల్లేరులో సీతాదేవికి సారె సమర్పిస్తున్న భక్తులు



శాకంబరీ దేవిగా పెడన పైడమ్మ

సీతమ్మకు ఆషాఢ సారె

మచిలీపట్నం టౌన్, జూలై 26 : బందరుకోట కోదండ రామాలయంలో సీతాదేవికి మంత్రి కొల్లు రవీంద్ర సతీమణి కొల్లు నీలిమ ఆధ్వర్యంలో తెలుగు మహిళలు ఆషాఢ సారె సమర్పించారు. లలితా సహస్ర నామ పారాయణ చేశారు. భక్తిగీతాలు ఆలపించారు. తెలుగు మహిళలు లంకిశెట్టి నీరజ, పాలపర్తి పద్మ, మాధవి, హైమావతి, చిట్టికుమారి, విశాలాక్షి పాల్గొన్నారు. **గుడ్లవల్లేరు** : గుడ్లవల్లేరు సంత సమీపంలో పోల్‌రాజ్ కాల్వగట్టుపైన ఉన్న వీరాంజనేయ స్వామి ఆలయంలో సీతమ్మ తల్లికి శుక్రవారం భక్తులు ఆషాఢ సారె సమర్పించినారు.

పెడన : పైడమ్మ అమ్మవారిని శాకంబరీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఈవో టి.వి.వి. మోహనరావు, వ్యవస్థాపక ధర్మకర్త దాసు వాయునందనరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. కన్యకా పరమేశ్వరీ దేవి ఆలయంలో అమ్మవారు శాకంబరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొల్లూరి చిన్నా పర్యవేక్షించారు.



వైకుంఠపురానికి టీడీపీ నాయకుడు సైకిల్ యాత్ర

కోడూరు : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విజయం సాధించిన నేపథ్యంలో కోడూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ధూళిపూడి మునేశ్వరరావు మొక్కు తీర్చుకునేందుకు వైకుంఠపురానికి సైకిల్‌పై బయలుదేరి వెళ్లారు. గంగానమ్మ గుడి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి యాత్రను ప్రారంభించారు. ముందుగా మంగళగిరి టీడీపీ కార్యాలయానికి వెళ్లి అక్కడ నుంచి వైకుంఠపురం వెంకటేశ్వరస్వామి దేవాలయానికి వెళ్లి మొక్కు తీర్చుకుంటానన్నారు. కూటమి నేతలు బండే శ్రీనివాసరావు, ఉల్లి శేషగిరిరావు, వడుగు నాగబాబు, పూతబోయిన శ్రీనివాసరావు, బచ్చు వెంకటేష్, పిల్లి మల్లిఖార్జునరావు, గోగినేని సోమశేఖరరావు, బొడ్డు వెంకన్న, కడవకొల్లు శ్రీనివాసరావు, వేములపల్లి శ్రీకృష్ణ, దావు మల్లి, సింగం సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నాయకుడు అనారోగ్యంతో మృతి

పెదపారుపూడి : చినపారుపూడి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు మలినేని వినయ్ (75) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. మండల పార్టీ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు వినయ్ పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మండల పార్టీ కార్యదర్శి మసిముక్కు రాంబాబు, దానబోయిన వెంకట నారాయణ, కొడాలి అశోక్, నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త కోటేశ్వరరావు మృతి

ఘంటసాల : టీడీపీ కార్యకర్త ఉన్న మల్లిపెద్ది కోటేశ్వరరావు (63) గుండెపోటుతో శుక్రవారం చిట్టూర్పులోని స్వగృహంలో మృతి చెందారు. మాజీ ముఖ్యమంత్రి దివంగత ఎన్టీఆర్‌కు కోటేశ్వరరావు వీరాభిమాని. కోటేశ్వరరావు పార్థివదేహాన్ని మండల టీడీపీ అధ్యక్షుడు తుమ్మల చౌదరి బాబు, టీడీపీ నాయకులు పరుచూరి సుభాష్ చంద్రబోస్, గొర్రెపాటి వెంకట రామకృష్ణ, సర్పంచ్ గూడపాటి వెంకటేశ్వరరావు, గుత్తికొండ వరప్రసాద్ తదితరులు సందర్శించి నివాళులర్పించారు. కోటేశ్వరరావుకు భార్య ఝాన్సీ లక్ష్మీ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. శనివారం కోటేశ్వరరావు పార్థివదేహానికి అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబసభ్యులు తెలిపారు.

ఒలింపిక్ క్రీడాకారులకు సంఘీభావం



చల్లపల్లి : ఒలింపిక్ క్రీడా సంబరం పారిస్‌లో ప్రారంభమైన సందర్భంగా శ్రీ విజయ అకాడమీ విద్యార్థులు క్రీడాకారుల విజయాన్ని కాంక్షిస్తూ ప్రదర్శన నిర్వహించారు. భారతదేశం నుంచి ఒలింపిక్స్‌లో పతకాలు కోసం పోటీ పడుతున్న 117 మంది అథ్లెట్లు ఘన విజయం సాధించాలని ప్రిన్సిపాల్ నాగళ్ల భీమారావు ఆకాంక్షించారు. జాతీయ జెండాలో విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. ఒలింపిక్స్ చిహ్నాన్ని ప్రతిబింబించేలా ఐదు రంగుల బెలూన్లతో ప్రదర్శన నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ భీమారావు, పీఈటీ టి.అర్జున్‌రావు, ఎం.కోటయ్య పాల్గొన్నారు.

చేనేత కళాకారులకు సత్కారం



ఘంటసాల : చేనేత పితామహుడు ప్రగడ కోటయ్య 109వ జయంతిని ఘంటసాల పంచాయతీ కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. కోస్తాంధ్ర పద్మశాలీ సంఘం ప్రధాన కార్యదర్శి అందె జగదీష్ తదితరులు ప్రగడ కోటయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చేనేత కళాకారులు కేతన రామకృష్ణ, గోలి కోటేశ్వరరావులను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. వుడతా చిత్తరంజన్ సాయి, గుత్తికొండ సత్యనారాయణ, పోలన వాసు, బండారు నాగేశ్వరరావు, అక్కల లీలా ప్రసాద్, నందం వెంకటేశ్వరరావు, నందం వెంకటేశ్వరరావు, మాచర్ల మస్తాన్, శీలం నాగమల్లేశ్వరరావు, జంజనం రామ్మోహనరావు, తుమ్మలచర్ల కమ, రోశారావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించకపోతే జరిమానా, లైసెన్స్ రద్దు

కూచిపూడి : ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని, నిబంధన పాటించకపోతే జరిమానా విధించడంతో పాటు లైసెన్స్ రద్దు చేస్తామని కూచిపూడి ఎస్సై శ్రీనివాస్ పేర్కొన్నారు. నిడుమోలు జాతీయ రహదారిపై హెల్మెట్ వాడకంపై వాహనదారులకు అవగాహన కల్పించారు. వాహనం నడిపే వారితోపాటు వెనుక కూర్చున్న వ్యక్తులు కూడా హెల్మెట్ ధరించాలన్నారు. నాలుగు సంవత్సరాల వయస్సు పైబడిన వారు కూడా హెల్మెట్ ధరించాలన్నారు. మోటార్ వెహికల్ చట్టం నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించి ప్రమాదాల నుంచి రక్షణ పొందాలన్నారు.

రామరాజుపాలెం కాల్వ పూడికతీత పనుల పరిశీలన



మచిలీపట్నం టౌన్ : రామరాజుపాలెం పంట కాల్వలో గుర్రపుడెక్క, తూటుకాడను త్వరితగతిన తొలగించాలని టీడీపీ జిల్లా తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ అన్నారు. శుక్రవారం రామరాజుపాలెం పంట కాలువలో గుర్రపుడెక్క, తూటుకాడ పూడికతీత పనులను పరిశీలించారు. దివి మహేష్, రమణ పాల్గొన్నారు.

కృత్తివెన్ను రక్షిత నీటి పథకానికి మరమ్మతులు

కృత్తివెన్ను : మండల ప్రజల దాహార్తి తీర్చే మెగా రక్షిత మంచినీటి పథకానికి మరమ్మతు పనులు చేపట్టారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, కూటమి నాయకులు పనులను శుక్రవారం పరిశీలించారు. రూ.9.8 లక్షల వ్యయంతో పనులు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ శివప్రసాద్, డీఈ నటరాజ్, ఏఈ నాగేశ్వరరావు పనులను పర్యవేక్షించారు. కూటమి నాయకులు ఒడుగు తులసీరావు, నెక్కంటి భాస్కరరావు, కూనసాని చిన్న, యాదంరెడ్డి కొండ, కూనసాని అశోక్, చేకూరి వెంకట్రావు, నడకుదుటి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు గొడుగుల పంపిణీ

పామర్రు : పామర్రు లయన్స్ క్లబ్ బృందం ఆధ్వర్యంలో చిరు వ్యాపారులకు అధ్యక్షుడు నవూలూరి వీర వెంకయ్యబాబు ఆధ్వర్యంలో గొడుగులు పంపిణీ చేశారు. బైసాని నాగేశ్వరరావు, తోట రమేష్‌లంకపల్లి శ్రీనివాసరావు, డాక్టర్ విక్టర్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ డస్ట్‌బిన్ల పంపిణీ

అవనిగడ్డ రూరల్ : పులిగడ్డ పంచాయతీ పల్లెపాలెంలో సర్పంచ్ దాసరి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఇంటింటికీ డస్ట్‌బిన్లు పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి రమాకుమారి, వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, వైస్ సర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ, అన్నదానం

చల్లపల్లి : కుమార్తె హిమవర్ష పుట్టిన రోజు సందర్భంగా బీసీ ప్రముఖులు వేముల అర్జునరావు సీయోను వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఆదరణ వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. రాంబాబు, ముమ్మనేని నాని, హరికృష్ణ, శేషగిరిరావు, నానిబాబు, చంద్రయ్య, సలీం, రమేష్, వేముల శ్రీను పాల్గొన్నారు.

రుద్రవరంలో శ్మశాన వాటిక అభివృద్ధి

మచిలీపట్నం టౌన్ : రుద్రవరంలో టీడీపీ నాయకుడు నీలం రమేష్ ఆధ్వర్యంలో శ్మశాన వాటిక అభివృద్ధి పనులు శుక్రవారం చేపట్టారు. ఎక్స్‌కవేటర్‌తో నేలను చదును చేశారు. గుమ్మడి అశ్వనీకుమార్, కంచర్ల గణేష్, నాగమునీంద్రరావు, విష్ణురాజ్ పాల్గొన్నారు.

శ్రీకాకుళేశ్వరస్వామికి బంగారపు బొట్టు సమర్పణ



ఘంటసాల : శ్రీకాకుళంలో వేంచేసి ఉన్న శ్రీకాకుళేశ్వర స్వామి దేవస్థానంలో స్వామివార్లకు చినరావూరు గ్రామస్థులు వి.నిరంజన్ దంపతులు సుమారు రూ.2.25 లక్షల విలువ కలిగిన బంగారపు బొట్టు సమర్పించారు. దాతలను ఆలయ ఉద్యోగులు, అర్చకులు ఘనంగా సత్కరించారు.

సాయిబాబాకు వెండిహారం



కోడూరు : కోడూరులో శ్రీ షిర్డి సాయి దివ్య ధ్యాన జ్ఞాన మందిరం నందు సాయినాథునికి కోడూరు గ్రామానికి చెందిన పూతబోయిన అయ్యప్ప స్వామి దంపతులు రూ.30 వేల విలువ గల వెండి హారాన్ని సమర్పించారు. ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయ చైర్మన్ రేపల్లె వెంకట నారాయణ (రఘు) ఆధ్వర్యంలో స్వామివారికి ఈ హారాన్ని అలంకరించారు.

అమ్మవార్లకు శాకంబరీ అలంకారం

నాగాయలంక : టి.కొత్తపాలెంలో భ్రమరాంబ మల్లీశ్వరస్వామి శాకంబరీగా దర్శనమిచ్చారు. సాయికిరణ్ శర్మ విశేష పూజలు చేశారు. **గుడివాడ** : భీమేశ్వరస్వామి దేవస్థానంలో పార్వతీదేవి శాకంబరీదేవిగా దర్శనమిచ్చారు. శ్రీలలితా భక్త బృందం ఆషాఢ సారెను సమర్పించారు. ఈవో నటరాజన్ షణ్ముగం ఏర్పాట్లు పర్యవేక్షించారు.